# ఖైదీ

పరమహంస



చీకటి. చిమ్మచీకటి. కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. అమావాస్యేమో అంతులేని చీకటి. రెడ్డిపాలెం రైల్వేస్టేషనులో మూడు గంటలు ఆలస్యంగా దించింది ప్యాసింజరు రైలు. తనొక్కడే దిగాడక్కడ. ఆగీ ఆగక

ముందే స్టేషనుమాస్టరు పచ్చలైటు చూపించాడు. అరనిముషమే ఆగిందో, నిమిషమే ఆగిందో ఆవిర్లు అర్చుకొంటూ బయలుదేరింది – గమ్యం చేరాలనే ఆరాటంతో. సమాంతరంగా సాగే ఇనుప పట్టాలమీద నిరవధికంగా అపరిశ్రాంత యానం చేసే రైలుకీ, విశాల విశ్వంలో జీవితాంతం ఆశా నిరాశల, సుఖ దుఃఖాల ద్వంద్వాలతో పోరాడుతూనే గడిపిపోయే మనిషి జీవితానికి ఎంతో సామ్యమూ వుంది. ఎంతో తేడా వుంది.

రైలు స్టేషను దాటి వెళ్ళాక, బరువైన సూట్‌కేసు పట్టుకొని పట్టాలు దాటి గేటుదాకా నడిచేడు సూర్యం.

లాస్ట్‌బస్ వెళ్ళిపోయుంటుంది. లేటు కాకూడదూ? ఆఁ ఇంకా వుంటుందా అర్ధరాత్రి కావస్తుంటే! అయినా ఆశ! గేట్‌మన్ మంచి నిద్రలో వున్నట్టున్నాడు. ధైర్యంచేసి లేపాడు.

"బస్సు వెళ్ళిందా" అనడిగాడు. వాడు విసుక్కొంటూ "ఇప్పుడేం బస్సయ్యా. ఎప్పుడో పోయింది. రేప్పొద్దున ఎనిమిదింటికి..." అనేసి పక్కకి తిరిగి పడుకున్నాడతను

"అబ్బో!రేప్పొద్దున ఎనిమిదింటిదాకా ఇక్కడుండాల్నా."

నోనో. ఐమస్ట్ గో నౌ. వెళ్ళాలి. ఈ రాత్రికే యింటికి చేరుకోవాలి," అనుకొన్నాడు సూర్యం.

చీకటిలో ఏమీ కనిపించటంలేదు. సూట్‌కేస్ తెరిచి టార్చిలైట్ తీశాడు. చలిగాలి వీస్తోంది. స్వెట్టరు తొడుక్కున్నాడు. చేతిలో హాండ్‌స్టిక్ వుంది. గట్టిదే. కాని అయిదు మైళ్ళు ఈ చీకట్లో ఒంటరిగా నడిచి వెళ్ళగలడా? వర్షం కూడా పడేలా వుంది ఖర్మ. ఎలా ... ఎలాగైనా వెళ్ళాలి. తప్పదు. లేచాడు. సూట్‌కేస్ ఒక చేత్తో, టార్చిలైట్ మరో చేత్తో పట్టుకొన్నాడు. హాండ్‌స్టిక్ చంకలో పెట్టుకొన్నాడు

దారి తనకు సుపరిచితమైందే. ఇరవై సంవత్సరాల క్రితం, తను చదువుకొనే రోజుల్లో ఎన్నోసార్లు నడిచాడు వూరినుండి రెడ్డిపాలెం స్టేషనుకీ, ట్రంకురోడ్డు దగ్గరికీ. బస్సు సౌకర్యం లేదప్పుడు. అయిదు మైళ్ళ నడక నీళ్ళప్రాయంలా వుండేది ... ఆరేళ్ళు దాటింది వూరికి వచ్చి. ఢిల్లీకి వెళ్ళాక రావటం పడలేదు. ఉద్యోగం అలాంటిది. ఖైదీ జీవితంలాంటిది. కావాలన్నప్పుడు శలవు దొరకదు. ఒక వారంరోజులు దొరికినా ఢిల్లీనుంచి రాకపోకల ప్రయాణమే ఆరు రోజులు తినేస్తుంది. ఇక వూళ్ళో వుండే దెప్పుడు ? బంధుమిత్రుల్ని కలుసుకొనేదెప్పుడు? పోయిన సంవత్సరం బావ తమ్ముడి పెళ్ళికి వద్దామనుకుంటే, అంతలోనే అత్యయిక పరిస్థితి ప్రకటింపబడటం, గ్రాంటు అయిన లీవుకూడా రద్దవటం జరిగింది. రాలేకపోయాడు. చెల్లెలు రాజీ, బావగారు

తన పరిస్థితి అర్థంచేసుకోరు. జైలు అధికారిగా ఉద్యోగమంటే ఆజన్మాంతర జైలు జీవితమన్న మాట !

అవసరానికి శలవు దొరకని ఆ వుద్యోగం ఎంత పెద్దదైతే మాత్రమేం- ఇళ్ళల్లో పెళ్ళిళ్ళకూడా రాలేక పోవటం విడ్డూరంగానే వుంది. ఉద్యోగాలు చేసేవాళ్ళంతా యిలాగే వున్నారా? తనవాళ్ళందర్నీ వొదులుకోవల్సిందేనా? అంటూ నిష్టూరంగా వుత్తరం రాసింది చెల్లెలు. బావగారికి కోపమొచ్చినట్లుంది. సరిగా సమాధానం వ్రాసేవాడు కాదు. ఆఖరికి అమ్మ – ఆమె కూడా అలానే రాసింది. "నీ పరిస్థితులు ఎలావున్నా కనీసం పెళ్ళికి వచ్చి అందర్నీ చూచి వెళ్ళితే బావుండే" దని.

కాళ్ళు అసంకల్పిత ప్రతీకార చర్యగా ఆగాయి వున్నట్టుండి. సిక్స్త్ సెన్స్ పనిచేసింది. టార్చి వెలిగింది. రెండడుగుల దూరంలో పొడవాటి పాము కప్పని మింగుతూ కదల్లేక కదులుతోంది. గుండెలు దడదడ లాడాయి. ఒక్క-క్షణం సంబాళించుకొని బూటుతో నేల మీద శబ్దం చేశాడు. పాము పచ్చిక లోకి జరిగిపోయింది. 'హమ్మయ్య' అనుకున్నాడు. ఏదో నీటిపాము చీకట్లో తీరిగ్గా కప్పను నంజుకొంటోంది.

దాదాపు మైలు నడిచేడు పాలెందాటి. రోడ్డు అతుకులు గతుకులుగా వుంది. గులకరాళ్ళు రోడ్డుమీద చిందరవందరగా వున్నాయి. గుంటలు, మిట్టలు. అయిదు మైళ్ళ రోడ్డులో ఇరవై చప్టాలు. మూడు నాలుగు వాగులు రోడ్డుని క్రాస్ చేస్తాయి. వర్షాకాలం ప్రయాణానికి ఇబ్బంది. తన చిన్నప్పటినుంచీ యీ రోడ్డు గతి యింతే. వేలు వేలు రిపేరు కోసం శాంక్షను అయినట్లు వినబడు తుంటాయి వార్తలు. రోడ్డు మాత్రం ఎక్కడ రిపేరవుతోందో కనబడదు! చప్టాల రిపేరుకి కేటాయించిన సిమెంటు నిజంగా ఉపయోగిస్తే ఇప్పటికి రోడ్డంతా సిమెంటుతోనే తయారయ్యేది. మరి ఆ సిమెంటంతా ఎవరిల్లు కట్టడానికి వెళ్తోందో ! తనలో తనే నవ్వుకున్నాడు సూర్యం.

నడుస్తూనే వున్నాడు నెమ్మదిగా. బరువైన సూట్ కేస్ చేతిని లాగేస్తూంది. తనవి మూడు జతల బట్టలు, చెల్లికి రెండు, అమ్మకి రెండు చీరెలు, జాకెట్ పీసులు, చెల్లెలి పిల్లలకి బట్టలు, బిస్కట్లు, అవీ యివీ వున్నాయి. రెండో చేతికి మార్చుకొన్నాడు. అలవాటు తప్పిన నడక. సిటీలో నడవవలసిన పనేముంది. అసలు సరదాకైనా నడిచి వెళ్ళే తీరికెక్కడ వుంది తనకి. తనకే కాదు. సిటీల్లో ఉద్యోగాలు చేసుకొనే వాళ్ళ కెవరికైనా తిండి తీరిగ్గా తినే టైమే దొరకదు సరిగ్గా. బస్సు టైం అయిందనో, లోకల్ ట్రైన్ తప్పిపో తుందనో, ఆలస్యంగా వెళ్తే 'అమ్మో-


ఇంకేమన్నా వుందా' అనో-ఒకటేమిటి, అన్ని పనులకీ-నిద్ర లేచినప్పట్నుంచి నిద్రపోయేంతవరకూ టైం ప్రకారం టంచనుగా ఆటోమాటిక్ ఫారిన్ గడియారంలా యాంత్రికంగా జీవితం గడపాల్సిందే ! అన్నట్టు యిప్పుడెంత టైం అయిందో? వాచీ చూసాడు. రేడియం డయల్ ఆటోమాటిక్, ఫారిన్ గడియారమది. అంత చీకట్లోనూ తళుక్కున మెరుస్తున్నాయి అంకెలు. ముల్లులు.

పన్నెండు గంటలు!

అర్ధరాత్రి, అమావాస్య, ఆదివారం.. దయ్యాల రోజు.

తనలో తనే నవ్వుకున్నాడు ఛాదస్తపు ఆలోచనకి. ఎన్ని ఆదివారాలు, అమావాస్యలు చూడలేదు. అర్ధరాత్రులు, నీరవ నిబిడాంధకారంలో జైలుగోడల మధ్య సగం చచ్చిన మనుషులు తప్పించుకోకుండా కట్టుదిట్టాలతో కాపలా కాస్తూ గడపలేదు. అది ఉద్యోగం! ఇప్పుడలా కాదే. ఎవరూ తోడు లేరు. చుట్టూ చిక్కని చీకటి. గతుకుల రోడ్డు. మొండి ధైర్యంతో నడుస్తున్నాడు ఇల్లు చేరాలనే ఆరాటంతో-విడుదలకోసం ఆశతో బ్రతికే యావజ్జీవ ఖైదీలా! తనుకూడా ఖైదీలాంటి వాడేనా? ఖైదీ పరిస్థితి వేరు. తన పరిస్థితి వేరు ఛ. ఛ. ఏమిటీ ఆలోచనలు. తలవిదిలించుకొన్నాడు.

మూడు రోజులు ప్రయాణంచేసి, ఢిల్లీనుంచి వచ్చి, చీకటికి భయపడి, నడక్కి వెనకాడి, ఈ రాత్రికి ఇంటికి చేరకపోవటమా? నాన్సెన్స్. తల్లిని చూట్టానికి ఇంత దూరం వచ్చాక ఒక్క నిముషం ఆగే ప్రశ్నేలేదు అమ్మ ఆరోగ్యం ఎలావుందో యిప్పుడు. పదిహేను రోజులుగా విశ్వప్రయత్నం చేస్తే దొరికింది పదిరోజులు శలవు. అమ్మని ఢిల్లీకివచ్చి తనతో వుండమంటే చిరునవ్వుతో తిరస్కరిస్తుంది. "పుట్టి, మెట్టిన వూరు వదలి రాలేనురా. నువ్వూ నీ సంసారమూ సుఖంగా వుంటే నాకు చాలు," అంటుంది. నిజంలో అమ్మ తనతోనే వుండాలని హృదయపూర్వకంగా అనుకోలేదు తను. ఆమె తనతో వుండాలంటే ఆమెకీ కష్టమే, తనకీ కష్టమే. అంటే తిండి పెట్టలేడనికాదు. అదంతే! అందుకనే, 'పల్లెటూళ్ళో తన వారందరితో కలసి బ్రతికే అనురాగమయ జీవితం పట్టణాల్లో నీకు దొరకదమ్మా' అంటాడతను. మరోకారణం కూడా లేకపోలేదు. తన భార్య రజని. ఆమె ఉద్యోగం ఆమెకుంది. పిల్లల్ని తయారుచేసి స్కూళ్ళకి పంపటం; వంట చేయటం; తను తయారుకావటం, ఇన్స్టిట్యూట్‌కి వెళ్ళటం-అంతా టైం ప్రకారం జరగాల్సిందే. అలాంటప్పుడు యింట్లో అమ్మ ఒక్కత్తె కే ఏమీ తోచదు. ఒకటి రెండుసార్లు వారం రోజులు గడపటమే గగనమైపోయిందామెకి. ఎప్పుడెప్పుడు తిరిగి వూరికెళ్ళి




పోదామా అని ఎదురుచూసేది వచ్చి నప్పట్నుంచి. అమ్మ మడీ, జపాలూ రజనికి అట్టే రుచించవు. రజని ఫాషన్లు, షోకులు, ఉద్యోగం అమ్మకి నచ్చవు. అందుకే ఆమె దూరంగా వుంటుంది.

ఎంతో ఆరోగ్యంగావుండే అమ్మ ఉన్నట్టుండి ఎందుకు జబ్బున పడ్డట్టు? అసలేం జబ్బుచేసిందో రాయదు. ఎప్పుడూ 'క్షేమం'గానే వున్నట్టు రాసే అమ్మ 'ఇటీవల కొంచెం అనారోగ్యం చేసింది. మరేం భయం లేదనుకో - మామయ్యా, చెల్లి వాళ్ళు చూస్తున్నారు.. వీలైతే కోడల్నీ, పిల్లల్నీ తీసుకొచ్చి ఒకసారి చూపించిపోవలసింది. మరలా చూడగలనో లేదో,' అని వ్రాసింది పదిహేనురోజుల క్రితం.

ఆ వుత్తరం తనకి భయాన్ని కలిగించింది.'చూడగలనో లేదో' అంటే-అంత అధైర్యం కలిగిందంటే - మనస్సులో తహతహ. 'తను వెళ్ళేసరికి అమ్మ వుంటుందా?' గుండెల్లో దడదడ. ఛ.ఛ. ఏమిటీ పాడు ఆలోచన - పొరపాటు చేశాడు తను. రజనిని, పిల్లల్ని తీసుకొని రావల్సింది. ఎంత చెప్పినా రజని వినలేదు.

"పోండి, మీ చాదస్తమూ మీరూనూ. మీ అమ్మగారు వందేళ్ళు బ్రతుకుతారు. ఏ జలుబో చేసుంటుంది. అంత మాత్రానికి పరీక్షల టైంలో పిల్లల్ని తీసుకెళ్ళటం ఎందుకు? మీరు ప్రమోషన్ పానల్లో వున్నారై తిరి. యీ టైంలో లీవు పెట్టడం బావుండదు. ఎంత డబ్బు ఖర్చు. ఎంత టీడియస్ జర్నీ" అన్నది.

ఆవిడ చెప్పిందంతా నిజమే. కాని అమ్మని చూడాలనేకోరిక ఆమె ఆరోగ్యం గురించిన ఆదుర్దా తనని నిలవనివ్వ లేదు. రజనికి ఆ మమకారాలు లేవు. "అంతగా మీ అమ్మనీ, చెల్లెల్నీ, మీ వాళ్ళందర్నీ చూడాలంటే మీరు వెళ్ళి రండి," అన్నది. అమె అనుజ్ఞతోనే ఈ ప్రయాణం చేసాడు.

"రజని అన్నట్టు అమ్మ కేమీ కాకూడదు. నూరేళ్ళు బ్రతకాలి." గట్టిగా అనుకొన్నాడు.

సగం దూరానికి పైబడి నడిచాడు. రివ్వున చల్లటిగాలి వీచింది. వర్షం పడే సూచన. ఆకాశం మెరిసింది తటుక్కున కళ్ళు మిరిమిట్లు కొలిపేలా. ఆ క్షణకాలం వెలుగులో ఎదురుగా రోడ్డుమీద, అల్లంత దూరాన ఏదో తెల్లటి ఆకారం కదులుతున్న స్ఫురహ. అదే సమయంలో గుండెలదిరేలా పెద్దగా ఉరిమింది ఆకాశం. గుండెలు గుబేలు మన్నాయి. కాళ్ళు స్తంభించిపోయాయి. శరీరం జలదరించింది. వెంట్రుకలు గగుర్పొడిచాయి...మెదడు మొద్దుబారి పోయింది. ఆలోచనలు తెగిపోయాయి... తెల్లటి ఆకారం దగ్గరగా వస్తున్నట్లు, తప్పించుకు పారిపోవాలనే ఆరాటం ఎక్కడో లోలోపల ప్రారంభమైంది కాబోలు, తనకు తెలీకుండానే కాలు కదిలింది, అడుగు పడింది, అంతే – ఎవరో బలంగా నెట్టినట్లైంది. కటుక్కున కాలు జారిపోయింది.ముందుకు తూలిపోయాడు విసురుగా. చేతిలో సూట్ కేస్ ఎగిరి దూరంగా పడ్డది. హాండ్ స్టిక్ ఎక్కడ పడిందో! బ్యాలెన్సు కుదరక ముందుకు పడిపోయాడు. గులకరాయి తక్కున కొట్టుకొంది నుదుటికి. 'అమ్మా' అని అరిచాడు. కాని పెదవులు దాటి శబ్దం రాలేదు. ఎవరో ఎక్కడికో బలవంతంగా తోసుకెళ్ళుతున్నట్టు వూహ...

రెండు చేతులకి బేడీలువేసి, మెడపై కర్రపెట్టి నెట్టుకొంటూ. మోకాళ్ళమీద కొట్టుకొంటూ, బరబరా లాక్కెళ్ళు తున్నారు పోలీసులు. ఇనుప సంకెళ్ళు 'ఖణేళ్ ఖణేళ్' మంటున్న శబ్దం. నెత్తిమీద గట్టిగా కొట్టిన చప్పుడు, చెవులు గింగుర్లెత్తుతున్నాయి. చెప్పలేని బాధ. వీపుమీద చెయ్యిపెట్టి ముందుకు తోసా రెవరో. చీకటి గొయ్యారంలా వున్న జైలు గదిలో తూలిపడ్డాడు. గది తలుపులు లాగి తాళం వేశారు. తనిప్పుడు ఖైదీ అది తన గదే. దాన్నెప్పుడు జైలు గదిగా మార్చారో తెలియటంలేదు...వొళ్ళంతా నొప్పులు. తల నొప్పి, నాలుక పిడుచకట్టుకు పోతోంది. శరీరం పచ్చి పుండులా వుంది ... తనవాళ్ళే తనను బంధించి తన గదిలోనే ఖైదు చేశారు! బాధతో 'అమ్మా' అని మూలిగాడు. అమ్మ ప్రత్యక్షమైంది. చల్లటి చేత్తో ప్రేమగా నిమిరింది. ఆమె కళ్ళనిండా నీరు.

మాట్లాడలేకపోతోంది "నీకేమైందమ్మా?" ఆమె చేతులు పట్టుకొన్నాడు పసిబిడ్డలా. చల్లగా వున్నాయి చేతులు - మంచు ముద్దల్లా. వెంటనే స్పృహ వచ్చింది.

బలవంతంగా కళ్ళు తెరిచాడు సూర్యం. చీకటి తప్ప మరేమీ కన్పించటంలేదు సన్నగా జల్లు పడుతోంది. చెయ్యి కదిల్చాడు. భారంగా వుంది. ఏదో వస్తువు తగిలింది చల్లగా. వేళ్ళతో నొక్కాడు. టార్చి వెలిగింది, చీకటి కోసుకుంటూ.

"అరె, టార్చి చేతిలోనే వుందా. థాంక్ గాడ్. జారి పడిపోలేదు ఎక్కడో... అవును నా కేమైందిప్పుడు. ఎందుకు పడిపోయాను ..." లేవబోయాడు. కుడికాలు మోకాటి దగ్గర కలుక్కుమంది. ఎడమకాలి మడిమ బెణికింది నుదుటిదగ్గర భగ్గుమన్నది.

"ఛ. ఛ. వాటీజ్ దిస్. వాట్ హాపెండ్ ?" పైకే అనేశాడు. లేచి కూర్చున్నాడు. నేలంతా చల్లగా, బురదగా వుంది...టార్చి వేసి చుట్టూ చూచాడు. కొంచెం దూరంలో సూట్ కేస్ పడివుంది. అదృష్టవశాత్తూ పగిలి చిందరవందర కాలేదు. నెమ్మదిగా లేచాడు.

"నేను భయపడ్డానా ఏమిటి?" స్వగతాన్ని ప్రకాశంగానే అనుకొన్నాడు. టార్చి వెలుగుతో 'ఆకారం' కనబడ్డ వైపుగా చూశాడు. తుమ్మచెట్టుకొమ్మ మీద చిరిగిన తెల్ల గుడ్డపీలిక దానిమీద తన హాండ్ స్టిక్ పడివుంది. ఆశ్చర్యం కలిగింది. ఇందాక దీన్నిచూచే దయ్యమని భయపడ్డాడన్నమాట. అదే సమయంలో గులకరాయి మీద పెట్టిన కాలుజారి పడిపోయాడు.

"వాటె పులీష్‌నెస్!" పెద్దగా నవ్వేశాడు. గుండెల్లో గూడు కట్టుకొన్న భయం పటాపంచలైపోయింది. వొళ్ళు తేలికైనట్లు ఫీలయ్యాడు. మోకాలు నొప్పిగా వుంది. మణికట్టు, నుదురు బాధపెడుతున్నాయి. 'ఐ డోంట్ కేర్' అనుకొన్నాడు. సూట్ కేస్, హాండిస్టిక్ తీసుకొని బయలుదేరాడు. బట్టలంతా బురదయ్యాయి. క్రింది పెదవి చిట్లి రక్తంకారి గడ్డకట్టింది. టార్చితో టైం చూశాడు. వాచీ గ్లాసు ముక్కలు ముక్కలైపోయింది. కానీ వాచీ మాత్రం అడుతూనే వుంది. తనకా సంఘటనతో సంబంధం లేనట్లు. ఒంటిగంట కావస్తోంది. 'అంటే దాదాపు అరగంట స్పృహ కోల్పోయానా' అనుకొన్నాడు.

"దట్సాల్ రైట్."

ఉప్పుకాలవ వంతెనమీద కొచ్చాడు. హమ్మయ్య! ఇక అరమైలే వుంది. పది నిముషాలు చాలు!

ఉప్పుకాలవలో నీళ్ళు నిండుగా వున్నాయి. చిన్నప్పుడు కాలవలోనూ, సొనల్లోనూ గాలాలు వేసి చేపలు పట్టడం సరదాగా వుండేది. గాలంతో

చేపలు పట్టడం పెద్ద ఆర్టు. టెక్నిక్ కూడా చాలా అవసరం. మనకంటే తెలివైనవి పక్కి చేపలు. ఎరని గిరుకు తింటాయిగాని ఒక పట్టాన గాలాన్ని మింగవు. మనల్ని కవ్వించి, ఏడిపించి పారిపోతాయి. కొన్ని రకాల చేపలు గాలం చూచీ చూడకముందే గుటుక్కున మింగి కూచుంటాయి పిచ్చి ముండలు. గాలపు వేటలో వుండే ఆనందం వర్ణనాతీతం!...నవ్వుకొన్నాడు.

మణికట్టు, మడిమ బాధపెడ్తున్నా, గతానుభవాల స్మృతులు మనస్సుకు కల్పించిన ఉత్తేజంతో ముందుకు సాగిపోయాడు సూర్యం.

ఊరికి దగ్గరగా వచ్చాడు. కోళ్ళ కొక్కొరోలు, కుక్కల అరుపులూ బాగా దగ్గరగా వినబడుతున్నాయి.

పంతులుగారి ఆకు తోట!

రోడ్డుకి రెండుపక్కలా మాగాణి పొలాలు!

నీళ్ళు. కీచు రాళ్ళు గోల...

అంతా తనకి పరిచయమైనదే.

మునసబుగారి అరటితోట. అక్కడ పెద్ద నేరేడు చెట్టు. నల్లగా నిగనిగలాడుతూ యింత లావున నేరేడుపళ్ళు ఎంత బావుండేవో! ఆ చెట్టు యింకా వుంది అలాగే.

ఊరిని అనుకొని రోడ్డుకి కుడి ప్రక్కన పెద్ద మర్రిచెట్టు. ఒకప్పుడు దాన్ని 'దెయ్యాల మర్రి' అనీ 'దొంగల మర్రి' అనీ అనేవాళ్ళు. నిజంగా ఆ చెట్టు కొమ్మల్లో ఎవరైనా దాక్కొంటే కనిపెట్టటం కష్టమే.


ఎడమచేతివైపు కరణంగారి దొరువు దాని ఒడ్డున బ్రాహ్మణ స్మశానం. అక్కడే శవాల్ని కాలుస్తారు. 'అమ్మని కూడా యిక్కడే కాల్చాలి కాబోలు!- అతని గుండె విపరీతంగా కొట్టుకో మొదలుపెట్టింది. "ఇచ్చోటనే గదా..." సత్య హరిశ్చంద్ర నాటకంలోని పద్యం.

"ఛీ. ఏమిటి ఇంత పిరికివాణ్ణై పోతున్నాను."-మనస్సుని, దృష్టిని బలవంతంగా రోడ్డుమీదికి మళ్ళించాడు.

అయిదు నిమిషాల్లో "కన్నేశ్వరాలయం" దగ్గరికొచ్చాడు.

'హమ్మయ్య, వూళ్ళోకి వచ్చేశాం' రిలాక్స్‌డ్‌గా శ్వాస వదిలాడు. పెద్ద దేవాలయం పురాతనకాలం నాటిది. గొప్ప స్థల పురాణమున్నది దానికి. ఆ చరిత్రంతా చెప్పి జీర్ణోద్ధారణ నిధికి చందాలు వసూలు చేస్తుండేవాడు సాంబయ్య పంతులు. పాపం పెద్దవాడైపోయిం తర్వాతకూడా గుడికోసమే జీవించాడు. కొడుకులు పెద్ద ఉద్యోగాల్లో వున్నా ఆయన మాత్రం గుడిని కని పెట్టుకొనే వుండి చనిపోయాడట! ఇప్పుడెవరు చూస్తున్నారో గుడి వ్యవహారం?

కరెంటు లైటు! ఆహా. వూరికి కరెంటు వచ్చిందన్నమాట. సంతోషం. పోయిన ఎలక్షన్ల సమయంలో వచ్చుం




టుంది! రోడ్డు సంగతే పట్టించుకోలేదెవరూ.

ఇక్కడెవరో పెద్ద మేడ కట్టారే! లేటెస్టు డిజైన్! "విశ్వనాథ శ్రేష్ఠి." ఎవరూ విస్సిగాడే! మొన్నటిదాకా తిండి గడవక మద్రాసులో ఏదో హోల్‌సేల్ షాపులో గుమాస్తాగా వున్నాడని విన్నామే! లాటరీ తగిలిందో! స్మగ్లింగ్ బిజినెస్ చేస్తున్నాడో!

ఆత్రేయగారిల్లు శిథిలమైపోయింది. ఎంత పెద్ద పెంకుటి లోగిలి! ఎంత సంసారం. అంతా ఉద్యోగాలకి వెళ్ళిపోయుంటారు. ఈ యిల్లు పడిపోయే స్థితికొచ్చింది.

శ్రీరాములవారి ఆలయం. ఎడమవైపు తిరిగాడు. అంత దూరాన కనబడుతోంది తన యిల్లు! గుండెల్లో దడ ప్రారంభమైంది. కాళ్ళలో వణుకు పుట్టుకొస్తోంది. వడివడిగా నడిచాడు.

ఏళ్ళ తరబడి వర్షాలకి సగం కరిగిపోయిన మట్టిగోడలం కాంపౌండు. పడిపోటానికి సిద్ధంగా వున్న పాత తలుపులు గుమ్మంతో సంబంధం లేనట్లు అంటీ అంటనట్లు వున్నాయి. చేతితో తడితే విరుచుకు పడిపోతాయేమో ననిపించి తలుపుమీద వేసిన చెయ్యి వెనక్కి తీసుకున్నాడు. అమ్మ నిద్రపోతోందేమో? ఎలా? తలుపు సందులోంచి చూసాడు. ముందు వరండాలో మసి కప్పుకొన్న కిరోసిన్ దీపం గుడ్డిగా వెలుగుతోంది.

ఇంటి తలుపులు కొంచెం తెరిచినట్లుంది. లోపల్నుంచి సన్నగా దీపం

కనబడుతోంది. ఎవరో కదులుతున్నారు. ఎవరు...రాజీ! అమ్మకు సేవలు చేయ టానికి వున్న ఒక్కగానొక్క కూతురు.

'రాజీ!...రాజీ!...' పిలిచాడు.

సమాధానం లేదు. మరలా పిలిచాడు బిగ్గరగా. మరో క్షణంలో లోపల యింటి తలుపు పూర్తిగా తెరచుకొని రాజీ, బావగారు బయటికొచ్చి వరండాలో నిల బడ్డారు. ఆశ్చర్యం, అనుమానంతో ఒకరి మొహా లొకరు చూసుకొంటున్నారు.

"రాజీ! నేను అన్నయ్యని." అన్నాడు సూర్యం.

"ఎవరూ...సూర్యమా!" అన్నాడు బావగారు.

"అన్నయ్యా" అంటూ రాజీ పరి గెత్తుకొచ్చి తలుపు తీసింది. సూర్యాన్ని చూట్టంతోనే ఆమె భయంతో ఒక్కడుగు వెనక్కి వేసింది. సూర్యం గమనించ కుండా లోపలికి వచ్చేశాడు.

"ముఖమంతా అదేంటన్నయ్యా, ఆ నెత్తురేమిటీ...?"

"అదేమిటి బావా! ఏమైంది ... ఆ నెత్తురేమిటి?" బావగారి ప్రశ్న.

"ఓహ్ అదా! చీకట్లో కాలుజారి రోడ్డుమీద పడిపోయాను. బట్టలకి బుర దంటుకొన్నది..."-సూట్ కేస్ అందు కొన్నది చెల్లెలు.

"ఇంత అర్ధరాత్రిలో వొంటరిగా నడిచొచ్చావా సూర్యం. టూ బాడ్. ముందు కాళ్ళూ మొహం కడుక్కో."

చెల్లెలు చెంబుతో నీళ్ళు తెచ్చి యిచ్చింది.

"ఆఁ, రాకుంటే రెడ్డిపాలెంలో రాత్రంతా ఎక్కడ వుండేట్లు. ఎరుగున్న రోడ్డేకదా! నెమ్మదిగా నడిచొచ్చేశాను... అన్నట్లు నువ్వెప్పుడొచ్చావ్ బావా?... రంగడు భిలాయ్‌లోనే వుంటున్నాడా? హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ చేయించు కోవాలని ఢిల్లీ వచ్చాడు పోయిన సంవత్సరం. తర్వాత వార్తలే లేవు వాడి దగ్గర్నుంచి." కాళ్ళు కడుక్కు న్నాడు. మొహం తుడుచుకొంటూ చెల్లెల్ని అడిగాడు, "అమ్మ కెట్లావుంది రాజీ?" ఆతృత కొట్టొచ్చినట్లు కనబడు తోంది. ఆమె ముఖంలో భావాలు సరిగా కనబడ్డంలేదు. వెంటనే సమాధానం రాలేదు. ఎక్కిళ్ళు పెడుతోందామె.

గుమ్మంలో అడుగుపెట్టిన సూర్యం ఠక్కున ఆగిపోయాడు. ఎదురుగా మిణుకు మిణుకు మంటున్న ఆముదపు దీపం అతని ప్రశ్నకు సమాధానం! "ఇంకెక్కడి అమ్మ..." రాజీ బావురు మన్నది. అవతల పెట్టటానికి ఎత్తిన కాలు గుమ్మంమీద పడి జారింది. బోర్లా పడిపోయాడు. నుదురు నేలకి కొట్టుకొంది. 'అమ్మా' అన్నాడు. స్పృహ పోయింది...మైకంలో-ఏవేవో దృశ్యాలు, ఏవేవో గోలలు, ఏవేవో భావాలు-అన్నీ అస్పష్టంగా-అర్థంకాని




వేదన, అంతంలేని ఆవేదన, అవధుల్లేని ఆర్తి, ఆక్రోశము, ఏదో, ఏదో...

మరో అయిదు నిమిషాలక్కాని ఈ లోకంలోకి రాలేకపోయాడు సూర్యం. చల్లటినీళ్ళు మొహాన చల్లింది గాబోలు, చెల్లెలు గుడ్డతో తుడుస్తోంది. "అన్నయ్యా..." అంటూ పిలుస్తోంది. 'బావా...సూర్యం' అంటూ పలకరిస్తున్నాడు బావ.

"ఆఁ." అన్నాడు నీరసంగా. కళ్ళు తెరిచాడు భారంగా. 'అమ్మా' అని ఆక్రోశిస్తోంది గుండె

ఎవరో చేయిపట్టుకు లేవదీసి కూర్చో బెట్టారు. పిసనక్రరతో విసిరాడు మామయ్య.

"బాబూ, సూర్యం..." గాద్గదికమైన గొంతుకతో పలకరించాడు డెబ్భై ఏళ్ళ ముసలాయన.

"మీరా మామయ్యా ... ఎప్పుడొచ్చారు?" నీరసంగా ప్రశ్నించాడు సూర్యం.

"మీ తల్లి పోయేముందుగా వచ్చానురా, ఆఖరి చూపు కోసం." నోటికడ్డం పెట్టుకొని ఏడుపు దిగమింగుతున్నాడాయన.

"నేను కన్నతల్లి ఆఖరిచూపుకూడా నోచుకోని దౌర్భాగ్యుణ్ణి మామయ్యా. నేను రాకముందరే వెళ్ళిపోయింది ... నన్ను చూట్టానికి యిష్టంలేక ..." మామయ్య వొడిలో ముఖం దాచుకొని పసిపిల్లాడిలా ఏడ్చాడు సూర్యం. రాజీ ఏడ్చింది. వాళ్ళని ఓదార్చటానికి శ్రమపడుతున్నాడు రాజీ భర్త.

"సూర్యం, ఏమిటి మరీ పసిపిల్లాడిలా? ఇంత షాక్ తింటావనుకోలేదు. నువ్వూరుకో...లేకుంటే రాజీ చూడు మరీ యిదైపోతోంది," అన్నాడు

"ఆఖరి క్షణాల్లో దగ్గరుండి చూచుకోలేని 'కొడుకు' నయ్యా నేను. మా అమ్మకి ఏ జబ్బూ రాదని, నూరేళ్ళు నిండుగా బతుకుతుందని పిచ్చిగా నమ్మానయ్యా నేను. ఉద్యోగం పేరుతో, కన్న తల్లికీ, పెరిగిన వూరికీ,దూరంగా-దగ్గరకు రాలేనంత దూరంగా బ్రతుకుతున్నాను. అందుకే అమ్మ నన్ను చూడకుండా వెళ్ళిపోయింది." ఏడుపు దిగమింగుతూ అన్నాడు.

"నో...నో...ప్లీజ్..." అంటున్నాడు బావ.

అప్పటికే చుట్టుపక్కలవాళ్ళు కొంతమంది వచ్చారక్కడికి. తెల్లవారింది.

కర్మ క్రతువులు శాస్త్రోక్తంగా పూర్తయ్యాయి.

సర్వం పోగొట్టుకొన్నవాడిలా శూన్యంలోకి చూస్తూ మౌనంగా వుండిపోయాడు సూర్యం.

ఢిల్లీకి వెళ్ళిన సూర్యం మరో నెల రోజుల్లోనే భార్యాబిడ్డలతో సహా తిరిగి వూరికి వచ్చేశాడు. అతని ముఖం యిప్పుడెంతో ప్రశాంతంగా వుంది - జైలునుంచి విడుదలైన 'నిర్దోషి' లాగా.

తన ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చేశాడు.

